ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
ఆదివారం 18 ఫిబ్రవరి 2024



పాఠశాల సహాయకులుగా పదోన్నతులు

పార్వతీపురం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పాఠశాల సహాయకులుగా పదోన్నతుల కోసం శనివారం ఐటీడీఏ కార్యాలయంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్, సమాన కేటగిరీ ఉపాధ్యాయులకు పీవో విష్ణుచరణ్ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ చేపట్టారు. మొత్తంగా వివిధ కేటగిరీలకు చెందిన 49 మందికి పదోన్నతులు కల్పించారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులను పీవో జారీ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఎం.రుక్మాందయ్య, ఏఎంవో జి.శ్రీనివాసరావు ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నాలుగున్నరేళ్లు గడుస్తున్నా.. అలానే వదిలేస్తారా?

- ఏజెన్సీలో అధ్వానంగా చెక్‌డ్యామ్‌లు
- నిర్వహణను గాలికొదిలేసిన సర్కారు
- మరమ్మతులకు కూడా నిధులు మంజూరు చేయని వైనం
- పూర్తిస్థాయిలో అందని నీరు.. ఏటా సాగుకు తప్పని ఇబ్బందులు
- మండిపడుతున్న గిరిజన రైతులు


దొంగలగెడ్డ వద్ద మరమ్మతులకు నోచుకోని చెక్‌డ్యామ్

(గుమ్మలక్ష్మీపురం)

జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో చెక్‌డ్యామ్‌లు అధ్వానంగా మారాయి. ఏళ్లు గడుస్తున్నా కనీస మరమ్మతులకు నోచుకోవడం లేదు. వాటి నుంచి చుక్క నీరు కూడా అందడం లేదు. నాలుగున్నరేళ్లు గడుస్తున్నా.. ప్రభుత్వం కూడా వాటిపై దృష్టి సారించడం లేదు. పూర్తిస్థాయిలో నిధులు కేటాయించకపోగా.. వాటి నిర్వహణను గాలికొదిలేసింది. దీంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఏటా సాగునీటి కోసం అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. గిరిజన రైతులకు సంక్షేమ పథకాలన్నీ అందిస్తున్నట్లు గొప్పలు చెప్పుకునే ప్రభుత్వం.. ప్రకటనలకే పరిమితమవుతోంది. ఏజెన్సీలో సాగుకు ఎంతో కీలకమైన చెక్‌డ్యామ్‌లపై శ్రద్ధ వహించకపోవడంపై గిరిజనులతో పాటు పలు సంఘాల నేతలు సైతం మండిపడుతున్నారు. మొత్తంగా సర్కారు తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇదీ పరిస్థితి..

పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని ఐదు మండలాల్లో సుమారు 250 చెక్‌డ్యాంలు నిర్మించారు. కొండలపై నుంచి వచ్చే నీటిని పంటలకు అందించేందుకు గాను గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస, కొమరాడ, సాలూరు, పాచిపెంటలో సుమారు పదేళ్ల కిందట స్పెషల్ మైనర్ ఇరిగేషన్‌శాఖ, గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వాటిని ఏర్పాటు చేశారు. ఇంటర్నేషనల్ ఫండ్ ఫర్ అగ్రికల్చర్ డెవలప్‌మెంట్, పీటీసీ యాక్షన్ ప్లాన్, ఉపాధి హామీ పథకం, రాష్ట్రీయ సంవికాస్ యోజన, ఎస్టీ మైనర్ ఇరిగేషన స్కీమ్, పోడు రిహాబిలిటేషన్ తదితర పథకాల నిధులను ఇందుకోసం వినియోగించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే అధికంగా నిధుల మంజూరవగా, పనులు కూడా జోరుగా సాగాయి. అయితే గతంలో ఈ చెక్‌డ్యామ్‌లు బాగానే పనిచేశాయి. పూర్తిస్థాయిలో సాగునీరు అందడంతో గిరిజన రైతులకు ఎటువంటి ఇబ్బంది ఉండేది కాదు. సుమారు పది వేల ఎకరాల్లో వివిధ పంటలు పండించేవారు. ప్రధానంగా ఖరీఫ్‌లో వరి, రబీలో వేరుశనగ, పొద్దు తిరుగుడు, వేసవి నువ్వులు, అరటి తదితర వాణిజ్య పంటలు సాగు చేసేవారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీన్ మారింది. నాలుగున్నరేళ్లు గడుస్తున్నా ప్రభుత్వం చెక్‌డ్యాంల మరమ్మతులకు నిధులు కేటాయించలేదు. కనీసం కాలువల్లో పూడికలు సైతం తీయించడం లేదు. దీంతో గిరిజ రైతులకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు. ప్రస్తుతం అనేకమంది సాగుకు దూరమయ్యారు. కొందరు ఖరీఫ్‌లో వరి సాగుకు వరుణుడిపై ఆధారపడుతున్నారు. ఒక్కోసారి రైతులంతా కలిసి శ్రమదానంతో కాలువల్లో పూడికలు తొలగిస్తున్నారు. అయినా అధికారుల్లో చలనం ఉండడం లేదు. చెక్‌డ్యాంల ద్వారా సాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ఖరీఫ్‌లో ఎలాగోలా సాగు చేపడుతున్న గిరిజన రైతులు రబీలో మాత్రం ఉపాధి పనులకు వెళ్తున్నారు. దీనిపై స్థానిక ప్రజాప్రతినిధులు సైతం పట్టించుకోకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిరుపయోగంగా..

గుమ్మలక్ష్మీపురం మండలంలోని గాంధ్ర బుడ్డిడి, వంజరాపు గూడ, నేంద్రకోన, వంగర, జేకేపాడు, చీమలగూడ, దుమ్మంగి తదితర ప్రాంతాల్లో భారీ చెక్‌డ్యామ్‌లు నిర్మించారు. వాటి పరిధిలో సుమారు వెయ్యి ఎకరాల ఆయకట్టు ఉంది. అయితే మరమ్మతులకు నోచుకోకపోవడంతో ప్రస్తుతం అవన్నీ నిరుపయోగంగా మారాయి. దీనిపై గిరిజనరైతులు కలెక్టరేట్ స్పందన, ఐటీడీఏలో ఎన్నోసార్లు వినతిపత్రాలు అందించినా.. ఫలితం శూన్యం. నేటికీ కనీస చర్యలు తీసుకోకపోవడంపై ఏజెన్సీ ప్రాంతవాసులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించాలని గిరిజన రైతులు కోరుతున్నారు. ఈ విషయమై గిరిజన సంక్షేమ శాఖ ఏఈ అప్పారావును వివరణ కోరగా తమ శాఖల ద్వారా ప్రతిపాదనలు పంపుతున్నామని తెలిపారు. నిధులు మంజూరు అయితే మరమ్మతులు చేస్తామని వారు చెబుతున్నారు.

ప్రభుత్వం స్పందించాలి..

గతంలో ఐటీడీఏ ద్వారా నిర్మించిన చెక్‌డ్యాంలకు ఐదేళ్లుగా ఎటువంటి మరమ్మతులు చేపట్టడం లేదు. నిర్వహణను పూర్తిగా గాలికొదిలేశారు. నీరందకపోవడంతో సాగు చేపట్టలేకపోతున్నాం. కొన్ని సందర్భాల్లో రైతులంతా కలిసి శ్రమదానంతో కాలువల్లో పూడికలు తీస్తున్నాం. దీనిపై ప్రభుత్వం, ఉన్నతాధికారులు చొరవ చూపాలి.

-కద్రక మిన్నారావు, గిరిజన రైతు, వంగర

వినతులు ఇచ్చినా..

కలెక్టరేట్ స్పందన, ఐటీడీఏలోనూ పలు వినతులు ఇచ్చినా చెక్‌డ్యాంల మరమ్మతులకు నిధులు మంజూరు కాలేదు. ఏళ్లు గడుస్తున్నా.. పట్టించుకునే వారే కరువయ్యారు. దీంతో గిరిజన రైతులు ఏటా సాగునీటికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించాలి.

-ఎం.రమణ, గిరిజన సంఘం నాయకుడు, గుమ్మలక్ష్మీపురం


ఎస్‌కే పాడులో చెక్‌డ్యామ్ ఇలా..


వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న పీవో కల్పనాకుమారి

సికిల్‌సెల్ ఎనిమీయా టెస్ట్‌లు చేయండి: పీవో

సీతంపేట: ఐటీడీఏ పరిధిలోని గిరిజన గ్రామాల్లో సున్నా నుంచి 40 సంవత్సరాలు వయసున్న ప్రతి ఒక్కరికీ సికిల్‌సెల్ ఎనిమీయా పరీక్షలు చేయాలని పీవో కల్పనాకుమారి ఆదేశించారు. శనివారం ఐటీడీఏ కార్యాలయంలో ఎంపీడీవోలు, పీహెచ్‌సీ వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సచివాలయ సిబ్బందితో సమన్వయం చేసుకొని అన్ని గ్రామాల్లో పరీక్షలు చేయాలన్నారు. ఇంకా గ్రామాల్లో, పాఠశాలల్లో టెస్టులు చేసుకోని వారు ఉంటే గుర్తించి వెంటనే పరీక్షలు చేయాలని సూచించారు. టెస్టుల రిపోర్టులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. రోజూ వాటిని ఐటీడీఏ కార్యాలయానికి అందించాలన్నారు.

మాతాశిశు మరణాల నివారణే లక్ష్యం

గిరిజన ప్రాంతాల్లో మాతాశిశు మరణాల నివారణే లక్ష్యంగా పనిచేయాలని ఐటీడీఏ పీవో కల్పనాకుమారి ఆదేశించారు. ఐటీడీఏ ఎస్.ఆర్.శంకరన్ సమావేశం మందిరంలో వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మాతాశిశు మరణాలను అరికట్టడానికి ఉపయోగపడే కిల్కారీ యాప్‌పై ఇస్తున్న శిక్షణను దోనుబాయి, కుశిమి, మర్రిపాడు పీహెచ్‌సీల పరిధిలోని ఆశా కార్యకర్తలు వినియోగించుకోవాలన్నారు. ఈ యాప్‌లో రూపొందించిన కోర్సును ప్రతిఒక్కరూ పూర్తి చేయాల్సి ఉంటుందని తెలిపారు. అనంతరం వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గర్భిణుల ఫోన్ నెంబర్లను ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ప్రతి వారం వాయిస్ రికార్డుతో వచ్చే ఫోన్ కాల్‌లో గర్భిణులకు అవసరమయ్యే సలహాలు, సూచనలు ఇస్తారని తెలిపారు. పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల డీఎంహెచ్‌వోలు జగన్నాథరావు, మీనాక్షి, డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయ పార్వతి, స్టేట్ ప్రోగ్రాం మేనేజర్ రాజు, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన రైతులు

- సక్రమంగా విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్
- విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా


పాచిపెంట సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

పాచిపెంట, ఫిబ్రవరి 17 : రైతన్నలు రోడ్డెక్కారు. సక్రమంగా విద్యుత్ సరఫరా చేయాలని నినదించారు. ఈ మేరకు శనివారం పాచిపెంట విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన కార్యక్రమం చేపట్టారు. రబీ పంటలకు అంతరాయం లేకుండా విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. తొమ్మిది గంటల పాటు నిరంతరంగా రైతులకు విద్యుత్ సరఫరా చేస్తామని హామీ ఇచ్చిన వైసీపీ ప్రభుత్వం.. నేడు కనీసం ఆరు గంటలు కూడా అందించడం లేదన్నారు. నీరు లేకపోవడంతో చేతికొచ్చిన పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. తమకు తీవ్ర నష్టం తప్పదని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి సాగునీటి కోసం నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు మాదిరెడ్డి తిరుపతినాయుడు, కార్యదర్శి బోను గౌరునాయుడు, సీఐటీయూ నాయకులు కోరాడ ఈశ్వరరావు, చింత పోలినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సీఆర్టీల ఆందోళన

- ఐటీడీఏ ఎదుట శిబిరంలోనే పడుకుని నిరసన

పార్వతీపురం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ద్వారా కొన్ని పోస్టుల భర్తీ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని పోరుబాట పట్టిన సీఆర్టీలు రెండోరోజు కూడా ఆందోళన కొనసాగించారు. ఈ మేరకు శనివారం రాత్రి ఐటీడీఏ కార్యాలయం ఎదుట శిబిరంలో పడుకుని నిరసన తెలిపారు. ప్రభుత్వం ఆ ప్రయత్నాలను విరమించుకోకుంటే తాము ఉపాధి కోల్పోతామని స్కూల్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న సీఆర్టీలు తెలిపారు. తమ కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. తమ సమస్యను అర్థం చేసుకుని న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. వారి నిరసన శిబిరానికి యూటీఎఫ్ జిల్లా నాయకుడు మురళీమోహన్‌రావు చేరుకుని సంఘీభావం తెలిపారు. డీఎస్సీ పేరిట ప్రభుత్వం సీఆర్టీలకు అన్యాయం చేయడం దారుణమన్నారు. దీనిపై పునరాలోచించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.


ఐటీడీఏ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సీఆర్టీలు

బిక్కు బిక్కు మంటూ..

- శిథిలావస్థలో గురుకుల పాఠశాల భవనం
- ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి
- నిర్మాణానికి నిధులు మంజూరు చేయని సర్కారు

ఈ ఫొటోలు చూసి పాడుబడిన భవనం అనుకున్నట్టే పొరబడినట్టే. ఇది సీతంపేటలోని ఏపీ గురుకుల రెసిడెన్సియల్ పాఠశాల భవనం. నాలుగు దశాబ్దాల కిందట దీనిని నిర్మించగా.. ప్రస్తుతం ఇది శిథిలావస్థకు చేరుకుంది. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. దీంతో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు బిక్కు, బిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. వాస్తవంగా 1984లో సీఎం హోదాలో ఎన్టీఆర్ సీతంపేట ఐటీడీఏను సందర్శించారు. అప్పుడే ఈ పాఠశాల సిబ్బంది క్వార్టర్స్‌ను మంజూరు చేసి భవనాల నిర్మాణానికి నిధులు సమకూర్చారు. అయితే ఈ గురుకులాన్ని ఏర్పాటు చేసి నాలుగు దశాబ్దాలు పూర్తయినప్పటికీ.. ఇంకా ఇదే భవనంలో పాఠశాల నిర్వహిస్తుండడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. ఈ పాఠశాల భవన నిర్మాణానికి గత టీడీపీ ప్రభుత్వం రూ.2 కోట్లు మంజూరు చేసింది. అయితే సకాలంలో ఇంజనీరింగ్ అధికారులు స్పందించలేదు. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం నాడు-నేడు కింద డార్మెట్రీ భవనం మరమ్మతులకే నిధులు మంజూరు చేసింది. దీంతో శిథిలావస్థలో ఉన్న పాఠశాలలోనే క్లాస్ రూమ్‌లు నిర్వహిస్తుండగా, అక్కడే విద్యార్థుల భోజనాలు, రాత్రి బస చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక్కడ 430 మంది గిరిజన విద్యార్థులు ఉండగా.. ఎప్పుడు ఏ ప్రమాదం వాటిల్లుతుందోనని వారి తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ తిరుపతిరాజును వివరణ కోరగా.. పాఠశాల భవన నిర్మాణానికి ఎలాంటి నిధులు మంజూరు కాలేదన్నారు. - సీతంపేట


స్లాబు ఇలా..


గురుకుల పాఠశాల భవనం


రెండో అంతస్తుపైన ఇలా..

మెరుగైన సేవలందించాలి: డీఎంవో


కేజీబీవీ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంవో

మక్కువ, ఫిబ్రవరి 17 : వెల్‌నెస్ కేంద్రాల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా మలేరియా నివారణా అధికారి (డీఎంవో) టి.జగన్మోహనరావు ఆదేశించారు. శనివారం వెంకట భైరిపురం, కాశీపట్నంలో వెల్‌నెస్ కేంద్రాలను పరిశీలించారు. రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. జ్వర లక్షణాలు ఉన్న వారిని గుర్తించి, వెంటనే నిర్ధారణ పరీక్షలు చేయాలన్నారు. వెల్‌నెస్ కేంద్రాల్లో 105 రకాల మందులు, 14 రకాల పరీక్షలు అందుబాటులో ఉంచాలని సూచించారు. అనంతరం కాశీపట్నం కేజీబీవీని సందర్శించి బాలికల ఆరోగ్య వివరాలపై ఆరా తీశారు.

ఇన్‌చార్జి జేసీగా ఐటీడీఏ పీవో

పార్వతీపురం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి జేసీగా ఐటీడీఏ పీవో విష్ణుచరణ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు జాయింట్ కలెక్టర్‌గా పనిచేసిన ఆర్.గోవిందరావు అమరావతికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నియామకమైన బీఆర్ అంబేడ్కర్ శిక్షణ తరగతులకు వెళ్లారు. ఇంకా విధుల్లో చేరకపోవడంతో తాత్కాలికంగా పీవోను ఇన్‌చార్జి జేసీగా నియమిస్తూ కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు.

ఎంఈవో-2 కార్యవర్గం ఎన్నిక

బెలగాం, ఫిబ్రవరి 17 : జిల్లాలోని ఎంఈవో-2ల (మండల విద్యాశాఖాధిరులు-2) కార్యవర్గం ఎన్నికైంది. ఈ మేరకు శనివారం పార్వతీపురంలో సమావేశం నిర్వహించి సంఘం ప్రతినిధులను ఎన్నుకున్నారు. పార్వతీపురం, జియ్యమ్మవలస, కొమరాడ, సీతానగరం , సీతంపేట , పాలకొండ, మక్కువ , పాచిపెంట మండలాలకు చెందిన వారు ఈ కార్యవర్గంలో ఉన్నారు. సంఘం అధ్యక్షుడిగా కె.ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా ఎం.శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షులుగా జి.చిన్న, తిరుపతిరావు, ట్రెజరర్‌గా ఎం.వెంకట రమణను ఎన్నుకున్నారు. ఇక రాష్ట్ర కో ఆర్డినేటర్లుగా సూర్యచంద, సోంబాబు, జనరల్ సెక్రటరీగా శ్యాం సుందర్, వైస్ ప్రెసిడెంట్‌గా సతీష్ ఎన్నికయ్యారు.


ఎన్నికైన ఎంఈవో-2 సంఘం కార్యవర్గ సభ్యులు

డిమాండ్లు నెరవేర్చాల్సిందే..

- జిల్లాలో ఉద్యోగుల నిరసన
- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్
- సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు



పాలకొండ తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న జేఏసీ నేతలు, ఉద్యోగులు


సాలూరులో ర్యాలీ చేస్తున్న దృశ్యం

సాలూరు/పాలకొండ, ఫిబ్రవరి 17: ప్రభుత్వం తక్షణమే తమ సమస్యలను పరిష్కరించాలని సాలూరు జేఏసీ సభ్యులు డిమాండ్ చేశారు. ఏపీ జేఏసీ పిలుపు మేరకు శనివారం పలు ఉద్యోగ సంఘాల నాయకులు ధర్నా చేశారు. అంతకుముందు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. బోసు బొమ్మ కూడలిలో మానవహారం చేపట్టారు. సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం రామా థియేటర్ ఎదురుగా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బాలబోలు ధనుంజయరావు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో జేఏసీ చైర్మన్ ఆకుల ప్రవీణ్‌కుమార్.. ప్రభుత్వంతో అనేకసార్లు చర్చలు జరిపినప్పటికీ ఫలితం లేకపోయిందన్నారు. అందుకే నిరసన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని తెలిపారు. గతంలో సీఎం జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, ఒకటో తేదీకి జీతాలు ఇవ్వాలని, ఓపీఎస్ అమలు చేసి ఐఆర్‌ను చెల్లించి పీఆర్‌సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. క్వాంటం ఆఫ్ పెన్షన్‌లో పాత పద్ధతి అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఆలస్యం లేకుండా చెల్లించాలని నినదించారు. ఉపాధ్యాయుల నియామకాల్లో ఉమ్మడి సర్వీస్ రూల్స్ అమలు చేయాలన్నారు. సర్కారు స్పందించే వరకు పోరాటం కొనసాగిస్తామని ఉద్యోగ, ఉపాధ్యాయులు, సంఘ నాయకులు స్పష్టం చేశారు. ఇక పాలకొండలో డివిజన్ జేఏసీ ఆధ్వర్యంలో ఎన్జీవోలు స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద మానవహారం చేపట్టారు. అంతకుముందు తహసీల్దార్ కార్యాలయం నుంచి కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎన్జీవో సంఘ గౌరవాధ్యక్షుడు లిల్లీపుష్పనాథం మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యలపై సర్కారు స్పందించాలన్నారు. వెంటనే డీఏ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో తహసీల్దార్ వరహాలు, డివిజన్ కార్యదర్శి పైల ఈశ్వరరావు, ఎస్‌టీవో గౌరీశ్వరరావు, ఎన్‌జీవో నాయకుడు అనూస్‌బాబు, జేఏసీ నేతలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

బాబుతోనే రాష్ట్రానికి దశా దిశ

● టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు సంధ్యారాణి

మెంటాడ: చంద్రబాబుతోనే రాష్ట్రానికి దశా దిశ అని ప్రజలు గ్రహించారని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. శనివారం జక్కువ గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం చిన్నాభిన్నం అయిందని విమర్శించారు. బటన్స్ నొక్కుతూ అదే అభివృద్ధి అని చెప్పుకుంటున్న జగన్‌రెడ్డికి పాలన తెలీదని ఎద్దేవాచేశారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ఆమె ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ శ్రేణులు చలుమూరి వెంకటరావు, జి.అన్నవరం, ముసలినాయుడు, రెడ్డి ఎర్నాయుడు, రెడ్డి ఆదినారాయణ, ఎ.సత్యం, రామలింగేశ్వరరావు, తాడ్డి గోవింద, గుమ్మిడి సంహాచలం, రెడ్డి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



'సూపర్ సిక్స్' కార్డులను చూపిస్తున్న సంధ్యారాణి

'రాజధాని ఫైల్స్'ను అడ్డుకోవడం పిరికిపంద చర్య: బంగార్రాజు



మాట్లాడుతున్న బంగార్రాజు

నెల్లిమర్ల: రాజధాని ఫైల్స్ సినిమాను సీఎం జగన్మోహన్‌రెడ్డి అడ్డుకోవడం పిరికిపంద చర్య అని టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. బూరాడపేట గ్రామంలో శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఆ సినిమా చూస్తే జనం ఛీ కొడతారని జగన్ భయపడుతున్నారని అన్నారు. విపక్షంలో ఉన్నపుడు రాజధాని ఏర్పాటును స్వాగతిస్తున్నామని అసెంబ్లీ సాక్షిగా చెప్పిన జగన్.. అధికారంలోకి రాగానే మూడు రాజధానుల పేరుతో డ్రామాలు ఆడింది నిజం కాదా.. అని బంగార్రాజు ప్రశ్నించారు. 276 మంది రైతులను పెట్టుకుని వేల మంది రైతు కుటుంబాలను రోడ్డున పడేసిన విషయం నిజం కాదా.. అని ఆయన ప్రశ్నించారు. రానున్న రోజుల్లో చంద్రబాబు నాయకత్వంలో అమరావతి రాజధాని సుందర నగరంగా అభివృద్ధి చెందుతుందని బంగార్రాజు వివరించారు. ఈ సమావేశంలో టీడీపీ పార్లమెంటు రెడ్డిక సాధికార సమితి కన్వీనర్ నీలాపు అప్పలరామిరెడ్డి, ఆ గ్రామ నాయకులు మక్కువ రాజారావు, మక్కువ సూర్యనారాయణ, బర్ల సామాలప్పడు పాల్గొన్నారు.

శంఖారావం సభ విజయవంతం

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేపే నాయుడు



మాట్లాడుతున్న కేఏ నాయుడు

గంట్యాడ: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ శంఖారావం సభను విజయవంతం చేసిన వారందరికీ పార్టీ గజపతినగరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఏ నాయుడు కృతజ్ఞతలు తెలిపారు. గంట్యాడలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు హాజరయ్యారని ప్రతిఒక్కరికీ అభినందనలు తెలిపారు. నియోజకవర్గంలో ఉన్న సమస్యలను లోకేశ్ దృష్టికి తీసుకుని వెళ్లామని చెప్పారు. రాజధాని ఫైల్స్ సినిమాతో నిజాలు జనాలకు తెలిసిపోతాయని, జగన్‌రెడ్డి వెన్నులో వణుకు పుడుతుం దని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కొండపల్లి భాస్కర్ నాయుడు, పార్టీ నాయకులు అల్లు విజయకుమార్, రంధి చినరామ నాయుడు, బూడి అప్పలనాయుడు, రొంగలి కృష్ణ, వేమలి చైతన్యబాబు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక



టీడీపీలో చేరిన పెంటశ్రీరాంపురానికి చెందిన చప్ప నారాయణప్పడు

నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో వైసీపీకి చెందిన పలువురు శుక్రవారం శంఖారావం సభలో నారా లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరారు. రామవరం, పెంటశ్రీరాంపురం, లక్కిడాం గ్రామాలకు చెందిన పలువురు టీడీపీలో చేరారు.

● **గజపతినగరం:** దావాలపేట పంచాయతీకి చెందిన వైసీపీ మాజీ సర్పంచ్ పొట్నూరు అప్పలరాముతో పాటు 50 కుటుంబాలు టీడీపీలో చేరాయి. శుక్రవారం రాత్రి గంట్యాడ మండలంలోని కెబిన్ కళాశాల ఆవరణలో జరిగిన శంఖారావం సభలో లోకేశ్ సమక్షంలో వీరు పార్టీలో చేరారు. పార్టీ లోకి చేరిన వారిలో కొట్యాడ రాంబాబు, కొట్యాడ సాయి, బూడి వేణు, తిమ్మనేని ఎల్లంనాయుడు తదితరులు ఉన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని, పని చేసే వారికి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని లోకేశ్ ఆయనకు హామీ ఇచ్చారు.



టీడీపీలో చేరిన వైసీపీ మాజీ సర్పంచ్ అప్పలరాం

సీఆర్టీలకు నష్టం లేకుండా చూడండి

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఒప్పంద ఉపాధ్యాయులకు(సీఆర్టీ) ఎటువంటి నష్టం లేకుండా గిరిజన సంక్షేమ శాఖా మంత్రి రాజన్నదొర, మాజీ గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పుష్పశ్రీవాణి, గిరిజన ఎమ్మెల్యేలు, ఎంపీ చర్యలు తీసుకోవాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తాడంగి సాయిబాబు, పాలక రంజిత్‌కుమార్ కోరారు. ఈమేరకు వారు మాట్లాడుతూ డీఎస్సీలో గిరిజన సంక్షేమ శాఖ పోస్టులు చూపించిన నేపథ్యంలో ఇప్పటికే ఒప్పంద ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నవారు తమ ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్న నేపథ్యంలో ఎవరికీ నష్టం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. 2016లో పోస్టులు లేవని 12 మంది గిరిజన ఒప్పంద ఉపాధ్యాయులకు తొలగిస్తే తాము పోరాటం చేసి తిరిగి నియామకం జరిగేలా చేశామని వారు గుర్తు చేశారు. మళ్లీ అదే పరిస్థితి వస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఒక వైపు ఒప్పంద ఉద్యోగులను రెగ్యులరైజేషన్ చేస్తామని, మరో వైపు భిన్నమైన నిర్ణయాలు ఏమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

ప్రజారోగ్యంపై పట్టించుకోండి



నగర పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న దృశ్యం

పాలకొండ: ప్రజారోగ్యంపై పాలకులు పట్టించుకోవాలని పాలకొండ పట్టణ పౌర సంఘాల ఐక్యవేదిక సభ్యులు, వివిధ పార్టీల ప్రతినిధి బృందాలు డిమాండ్ చేశాయి. 1, 2, 19, 20 వార్డులకు ఆనుకుని డంపింగ్‌యార్డు సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు శనివారం నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ డంపింగ్‌యార్డుతో ఆ ప్రాంత ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని చెప్పారు. దీనిపై కమిషనర్ స్పందించి.. ఇప్పటికే పాలకవర్గ సభ్యులతో మాట్లాడాం.. సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కమిషనర్‌కు వినతిపత్రం అందించిన వారిలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గంటా సంతోష్, ఒకటో వార్డు కౌన్సిలర్ పడాల రాంబాబు, వైసీపీ పట్టణ నాయకులు కోరాడ సూర్యనారాయణ (బాబు), జనసేన పార్టీ నాయకులు పోరెడ్డి ప్రశాంత్, సీఐటీయూ నాయకులు దావాల రమణారావు, కారెపు చిట్టిబాబు, టీడీపీ నాయకులు నమ్మి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ప్రాంతాల సమస్యలపై చర్చ

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: రాష్ట్రంలో పర్యటించేటప్పుడు తన దృష్టికి వచ్చిన గిరిజన ప్రాంత సమస్యలపై ఆ శాఖ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండేతో ఏపీ ఎస్టీ కమిషన్ చైర్మన్ డా.డీవీజీ శంకరరావు చర్చించారు. అమరావతిలో శనివారం ఆయనతో చర్చించారు. ముఖ్యంగా గిరిజన సంక్షేమ పాఠశాలలు, ఏకలవ్య, గురుకులాల్లో పనిచేస్తున్న సీఆర్టీలు ప్రభుత్వం చేపడుతున్న ఉద్యోగ అవకాశాల వల్ల తమను తొలగిస్తారేమోనన్న ఆందోళనను వెల్లబుచ్చిన సంగతి, గురుకుల్లో పదోన్నతులు, రెగ్యులరైజేషన్ వినతులు, బొర్రా, అరకుల్లో పర్యాటక రంగంలో పనిచేస్తున్న ఉద్యోగుల విజ్ఞాపనలు తదితర అంశాలపై చర్చించినట్టు తెలిపారు. బొర్రా పంచాయతీకి టూరిజం శాఖ నుంచి వాటా నిధులు రాకపోవడం, ప్రైవేటు సంస్థల ద్వారా అడ్వంచర్ పార్కుల ఏర్పాటుతో పర్యావరణానికి, స్థానిక గిరిజనులకు, వారి హక్కులకు కలుగుతున్న నష్టంపై, వారి ఆందోళన, అటవీ హక్కుల అంశాలపై చర్చ వచ్చింది. ప్రభుత్వం ఈ అంశాలపై సత్వరమే స్పందిస్తుందని చెప్పారు.

అడవులపై అవగాహన కలిగి ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గుమ్మలక్ష్మీపురం: పాఠశాల నుంచే విద్యార్థులకు అడవులను ఎలా కాపాడాలి అనే అంశంపై అవగాహన కలిగి ఉండాలని అటవీ అధికారులు నీలమణి, మండ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం దేవానంద్ అన్నారు. శనివారం మండల ప్రాథమిక పాఠశాలలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఎం.నీలవేణి, పాఠశాల హెచ్ఎం దేవానంద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అటవీ ప్రాంతంలో నేలపై ఉన్న ఆకులు, ఎండిన తుప్పలు వాటంతటవే కుళ్లి నేలపై సారంలా ఏర్పడతాయని చెప్పారు. వాటిని కాల్చి బూడిదచేయరాదని, అడవుల్లో కల్చిన సిగరెట్, బీడీలు, మంటలకు సహకరించే వస్తువులు వేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది ప్రసాదరావు, కరుణాకరరావు, గణేష్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలపై పరిశీలన

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని చేముడుగూడ, గుమ్మగడబవలస గ్రామాల్లో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి మూటక నారాయణ, వైద్య బృందంతో కలిసి శనివారం సందర్శించారు. ముందుగా అక్కడ చిన్నారులకు, గర్భిణులకు వైద్య సిబ్బంది వ్యాధినిరోధక టీకాలు వేయడాన్ని ఆయన పరిశీలించారు. గ్రామంలో మొత్తం గర్భిణులు ఎంతమంది, ఐదేళ్లలోపు పిల్లల ఎంత మంది ఉన్నారు, వారిలో నవజాతా శిశువుల వివరాలపై ఆరా తీశారు. అనంతరం వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్స్ జయగౌడ్, యారయ్యమ్మ, ఏఎన్ఎం భాగ్యలక్ష్మి, దమయంతి, ఆశ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల వేలం

పాలకొండ: ఎక్సైజ్ కేసులు, నాటుసారా కేసుల్లో పట్టుబడిన వాహనాలకు శనివారం పాలకొండ స్టేషన్ ఆవరణలో డీఎస్పీ జి.వి.కృష్ణారావు ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. పాలకొండ, వీరఘట్టం, దోనుబాయి, సీతంపేట పోలీస్ స్టేషన్ల పరిధిలో పట్టుబడిన వాహనాలను వేలం వేశారు. ఆటోలు రెండు, ద్విచక్ర వాహనం ఒకటి వేలం వేశారు. రెండు ఆటోలను రూ.24,400కు పాడగా, ద్విచక్ర వాహనాన్ని రూ.31,500కు పాడారు. వీరఘట్టంలో ఎక్సైజ్ కేసుల్లో సీజ్ చేసిన నాలుగు ద్విచక్ర వాహనాలను వేలం వేయగా వాటిలో ఒక బైకను మాత్రమే రూ.3,100కు పాడారు. మిగిలిన వాహనాలను పాడడానికి ఎవరూ ముందుకు రాలేదు. దోనుబాయి పీఎస్‌లో ఒక ద్విచ క్ర వాహనాన్ని రూ.49 వేలకు పాడారు.


సారా ధ్వంసం



సారాను ధ్వంసం చేయడానికి సిద్ధమవుతున్న పోలీసులు

పాలకొండ పోలీసు స్టేషన్ పరిధిలో పట్టుబడిన 52 మద్యం సీసాలు, 340 టర్ల సారాను డీఎస్పీ కృష్ణారావు ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. వీటి విలువ సుమారు రూ.75,800 ఉంటుందన్నారు. వీరఘట్టం పీఎస్ పరిధిలో 169 లీటర్ల సారాను ధ్వంసం చేశారు. దీని విలువ సుమారు రూ.33,800 ఉంటుందన్నారు. దోనుబాయి పీఎస్ పరిధిలో రూ.14,600 విలువైన 73 లీటర్ల సారా ధ్వంసం చేశారు. సీతంపేట పీఎస్ పరిధిలో 562 లీటర్ల సారాను ధ్వంసం చేశారు. దీని విలువ రూ.1,12,400 ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ చంద్రమౌళి, వీరఘట్టం, పాలకొండ ఎస్ఐలు గోవిందరావు, ప్రశాంత్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆ పోలింగ్ కేంద్రాలను మార్చండి



మాట్లాడుతున్న తహసీల్దార్ జయ ప్రకాష్

వీరఘట్టం: మండలంలోని 252, 257 పోలింగ్ కేంద్రాలను సరైన వసతులు ఉన్న చోటుకు మార్చాలని వివిధ పార్టీల నాయకులు కోరారు. తహశీల్దార్ శనివారం వివిధ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. నాయకుల సూచనలు ఉన్నతాధికారులకు నివేదిస్తామని తహశీల్దార్ అన్నారు. కుటుంబంలోని సభ్యుల ఓట్లు వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో ఉన్నాయని.. కుటుంబం మొత్తం ఓట్లు ఒకే పోలింగ్ కేంద్రానికి వచ్చేలా చేయాలని పలువురు తహశీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు.

ఎట్టకేలకు..

● పట్టణంలో రహదారిపై గుంతల పూడ్చివేత



పాతబస్టాండ్ కూడలి వద్ద రహదారి మరమ్మతులు చేపడుతున్న దృశ్యం

పార్వతీపురంటౌన్: పట్టణంలోని పలు కూడళ్లతోపాటు అంతరాష్ట్ర రహదారి అధ్వానంగా మారిందని ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాలకు ఆర్అండ్‌బీ అధికారులు స్పందించారు. పట్టణంలో పాతబస్టాండ్ కూడలితో పాటు అంతరాష్ట్ర రహదారి మధ్యలో ఏర్పడ్డ గుంతలను ఆర్అండ్‌బి అధికారులు ఆదేశాల మేరకు పూడ్చేందుకు శనివారం చర్యలు చేపట్టారు. గత కొన్ని నెలలుగా పలు కూడళ్లతో పాటు పట్టణం గుండా వెళ్లే అంతరాష్ట్ర రహదారి మధ్యలో గుంతలు ఏర్పడడంతో పాదచారు లతో పాటు వాహన చోదకులకు ఇబ్బందిగా మారింది. ఎట్టకేలకు ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి చర్యలు చేపట్టారు.

డ్వాక్రా సంఘాల బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న సత్యంనాయుడు

వీరఘట్టం: డ్వాక్రా సంఘాల బలోపేతానికి వీపీఏలు కృషి చేయాలని ఇన్‌చార్జి ప్రాజెక్టు డైరెక్టర్ వై.సత్యంనా యుడు అన్నారు. గ్రామాల్లోని రుణ వసూలు తదితర వివ రాలు ఎప్పటికప్పుడు సభ్యు లకు తెలియజేయాలన్నారు. మండల కేంద్రంలోని చేయూత మహిళా మార్ట్ మరింత అభివృద్ధిలోకి తీసుకెళ్లాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ బి.ప్రవీణ్ కుమార్, ఏపీఎం బి.శివనాయుడు తదితరులు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ డైరీని కలెక్టర్ నిశాంత్ కుమార్ శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, ఇన్‌చార్జి డీఆర్‌ఓ కె.హేమలత, పాలకొండ ఆర్డీఓ వి.వి.రమణ, అసోసియేషన్ జిల్లా సెక్రటరీ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఉజ్వల గ్యాస్‌పై అవగాహన

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట పంచాయతీ జేకేపాడు గ్రామంలో ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు వంటగ్యాస్ వాడకంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. గుమ్మలక్ష్మీపురం గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో పేద గిరిజన కుటుంబాలకు ఉజ్వల గ్యాస్ పంపిణీ వంటగ్యాస్ వాడే విధానం దగ్గర అంశాలపై ఈసీ అధికారులకు తగిన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు గిరిజన సంఘాల మహిళలు పాల్గొన్నారు.

జగనన్న గృహాలపై విచారణ

భోగాపురం: ముక్కాం గ్రామంలో జగనన్న ఇళ్ల నిర్మాణ విషయంలో వచ్చిన ఫిర్యాదుల మేరకు మండల ప్రత్యేక అధికారిణి సుధారాణి శనివారం స్థానిక సచివాలయంలో విచారణ నిర్వహించారు. జగనన్న ఇళ్ల నిర్మాణానికి సిమెంటు, ఇనుము అందలేదని ఫిర్యాదు రావడంతో విచారణ నిర్వహించామని తెలిపారు. ఇక్కడ 181 మందికి జగనన్న గృహాలు మంజూరు కాగా, వాటిలో 91 మంది మాత్ర మే పునాదులు వేసుకున్నారని చెప్పారు. ఈ విచారణకు 10 మంది లబ్ధిదారులు మాత్రమే హాజరయ్యారు. దీంతో ఇంటింటికి వెళ్లి విచారణ చేపట్టాలని హౌసింగ్ అధికారులకు, కార్యదర్శికి ఆమె సూచించారు. అనంత రం జగన్న గృహాలు మంజూ రైన స్థలానికి వెళ్లి పరిశీలించారు. హౌసింగ్ డీఈ మురళి, స్థానిక నాయకుడు రొయ్యడు, ఏఈ రాజేష్, కార్యదర్శి అబ్దుల్ సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

భోగాపురం: భోగాపురం ఐసీడీఎస్ పరిధిలో 2 అంగన్‌వాడీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని సీడీపీవో ఎస్తేర్‌రాణి శనివారం తెలిపారు. పూసపాటిరేగ మండలం పూసపాటిరేగ-2(ఎస్టీ), డెంకాడ మండలం పినతాడివాడ-1(ఓసీ) అంగన్‌వాడీ పోస్టులకు ఈనెల 24 నాటికి దరఖాస్తులు చేసుకోవాలని చెప్పారు.

వైసీపీకి ఊహించని దెబ్బ

● జనసేనలోకి చేరేందుకు 15 గ్రామాల నాయకుల సన్నాహం



మాట్లాడుతున్న జనసేన నాయకుడు రామకృష్ణ

మెంటాడ: మండలంలో అధికార వైసీపీకి ఊహించని దెబ్బ తగిలింది. సుమారు 15 గ్రామాలకు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పాలని నిర్ణయించారు. త్వరలోనే వారంతా జనసేనలో చేరబోతున్నట్టు ప్రకటించారు. శనివారం జయితి సమీపంలోని తోటలో మాజీ ఎంపీటీసీ కాశీనాయుడు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వీరిలో మాజీ సర్పంచ్ చింత సీతమ్మ, మాజీ ఎంపీటీసీ చింత కాశీనాయుడు, మీసాలపేట మాజీ సర్పంచ్ లెంక నారాయణ, రాబంద మాజీ సర్పంచ్ రామారావు, కోఆపరేటివ్ డైరెక్టర్ మజ్జి అప్పలనాయుడు తదితర ముఖ్య నాయకులతో పాటు వారి అనుచరులు, ప్రధాన కార్యకర్తలు సుమారు 150 మంది హాజరయ్యారు. జనసేన సాలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి గేదెల రామకృష్ణ నేతృత్వంలో వీరంతా సమావేశమయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులకు కనీస మర్యాద మన్ననలు దక్కలేదని, గ్రామాల్లో అభివృద్ధి ఎండమావిగా మారిందని, ఈనేపథ్యంలోనే జనసేనలో చేరాలని నిర్ణయించుకున్నామని స్పష్టం చేశారు. చేరిక తేదీని ఒకట్రెండు రోజుల్లోనే నిర్ణయిస్తామని చెప్పారు. రామకృష్ణ.. వీరి నిర్ణయాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు కూనిబిల్లి త్రినాథ్, పి.శేఖర్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు సిద్ధం కావాలి



ధర్నా నిర్వహిస్తున్న ఉద్యోగులు

భోగాపురం: ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే ఉద్యోగులందరూ సమ్మెకు సిద్ధం కావాలని భోగాపురం తాలూకా జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ కొమ్మూరు దుర్గారావు పిలుపునిచ్చారు. రాష్ట్ర జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు శనివారం భోగాపురం, డెంకాడ, పూసపాటిరేగ మండలాలకు చెందిన ఉద్యోగులు, పింఛన్‌దారులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉద్యోగులందరూ మానసికంగా, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. సరెండర్ లీవుల మొత్తం నగదు పెండింగులో ఉందని, దాచుకున్న డబ్బులు కూడా ఇవ్వడం లేదన్నారు. ఉద్యోగుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఈనెల 27న చలో విజయవాడ కార్యక్రమం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సూరి అప్పారావు, గణపతిరావు, ఉమాపతి, శరత్‌కుమార్, బంగారుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

● జేఏసీ అధ్యక్షుడు గణేష్

నెల్లిమర్ల: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పీఆర్‌సీని అమలు చే యాలని ఏపీజేఏసీ నెల్లిమర్ల తాలూకా యూనిట్ అధ్యక్షుడు గణేష్ డిమాండ్ చేశా రు. జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం ఉద్యో గులు ధర్నా నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఉద్దేశించి గణేష్ మాట్లాడుతూ బకాయి లను విడుదల చేయాలని కోరారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పిల్లల పెళ్లి కోసం దాచుకుంటున్న జీపీఎఫ్ సొమ్మును విడుదల చేయకపోవడం ఘోరమని అన్నారు. పింఛన్ దారులకు వెంటనే అదనపు క్వాంటం పెన్షన్ రిలీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పింఛనుదారుల అసోసియేషన్ అధ్యక్షుడు విశ్వనాథరాజు, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు డి.ఈశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి పైడిరాజు, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పతివాడ త్రినాథ్, ఏపీఎన్‌జీఓ కార్యదర్శి యర్ర రమణ, కోశాధికారి ధనుంజయ్, ఉపాధ్యక్షులు నవీన్, నాగరాజు, సంయుక్త కార్యదర్శి శంకరరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

బెలగాం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించిన ఎన్నికల బాండ్లపై సుప్రీం కోర్టు తీర్పు, ఎన్నికల సంస్కరణలు, దొంగ డబ్బు పాత్రపై వివిధ పార్టీల వైఖరి తెలపడానికి ఈనెల 18న సుందరయ్య భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు సీపీఎం నాయకులు రెడ్డి వేణు ఒక ప్రకటనలో శనివారం తెలిపారు. ప్రజా సంఘాలు, ప్రజా తంత్ర వాదులు, లౌకిక వాదులు హాజరవ్వాలని కోరారు.

కష్టపడే తత్వంతో గుర్తింపు

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: నిబద్ధత.. కష్టపడే తత్వంతో జేసీ ఆర్.గోవిందరావు గుర్తింపు పొందారని కలెక్టర్ నిశాంత్ కుమార్ ప్రశంసించారు. జిల్లా నుంచి బదిలీపై వెళుతున్న జేసీ గోవిందరావును శనివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వీడ్కోలు పలికారు. కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ జిల్లాపై జేసీ తనదైన ముద్ర వేశారన్నారు. జేసీ గోవిందరావు మాట్లాడుతూ జిల్లాలో పనిచేసిన కాలంలో మార్గ నిర్దేశం చేసిన కలెక్టర్ నిశాంత్ కుమార్‌కు, సహకరించిన అధికారులు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్‌ఓ జి.కేశవనాయుడు, పార్వతీపురం, పాలకొండ ఆర్డీఓలు హేమలత, వి.వి.రమణ, ఇంజినీరింగ్ అధికారి కృష్ణాజీ తదితరులు పాల్గొన్నారు.

9న లోక్ అదాలత్

గజపతినగరం: వచ్చేనెల 9వ తేదీన లోక్ అదాలత్ నిర్వహిస్తామని, ఇందులో భాగంగా కేసులు పరిష్కారం అయ్యే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని న్యాయాధికారిణి బి.కనకలక్ష్మి అన్నారు. శనివారం స్థానిక జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో పోలీస్‌శాఖ, ఎక్సైజ్ శాఖతో పాటు న్యాయవాదులతో సమావే శం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్సైజ్ శాఖకు చెందిన కేసులు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో చిన్న తగదాలతో పాటు సివిల్ కేసులు పరిష్కరించే దిశగా కక్షిదారులకు కౌన్సిలింగ్ నిర్వహించి కేసులను పూర్తి చేయాలని ఆమె సూచించారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

భోగాపురం: స్వయం ఉపాధి ద్వారా మహిళలందరూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని డీఆర్‌డీ పీడీ ఎ.కళ్యాణ చక్రవర్తి అన్నారు. శనివారం నందిగాం గ్రామం లో నాబార్డు సహకారంతో అగరబత్తుల తయారీ శిక్షణ పొందిన వారితో ఏర్పా టుచేసిన సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. నాబార్డు డీడీఎం పి.నాగార్జున, ఏసీ రాజ్‌కుమార్, ఏపీఎం రమణ పాల్గొన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

భోగాపురం: మహారాజపేటలో బెల్టుషాపు నిర్వహిస్తున్న ఎ.అప్పయ్యమ్మను అరెస్టు చేసినట్లు సీఐ ఎ.రవి కుమార్ శనివారం తెలిపారు. ముందస్తు సమాచారం మేర కు ఎస్ఐ పి.సూర్యకుమారి, సిబ్బందితో వెళ్లి తనిఖీలు నిర్వహించారని చెప్పారు. ఈ తనిఖీల్లో అక్రమంగా మద్యం అమ్మకాలు జరుపుతున్నట్టు గుర్తించి, 21 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారని సీఐ తెలిపారు.

లక్ష్మీ బస్ స్టేషన్లు ప్రారంభం

రాయగడ: ప్రయాణికుల సౌకర్యార్థం రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో అత్యాధునిక హంగులతో నిర్మించిన 20యూఎం బస్‌స్టేషన్లను ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ శనివారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఇందులో భాగంగా రాయగడ జిల్లాలోని మునిగుడ సమితి, కొల్నార సమితిలో నూతన బస్టాండ్లు ప్రారంభమయ్యాయి. మునిగుడలో రాష్ట్ర మంత్రి జగన్నాథ సారక, బిజూ స్వస్థ కల్యాణ యోజన సలహాదారు సుధీర్‌దాస్, జిల్లా కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ తదితరులు పాల్గొనగా, కొల్నార సమితిలో స్థానిక ఎమ్మెల్యే మకరందముదిలి, జడ్పీ అధ్యక్షురాలు సరస్వతి మారిు, టునిహుయిక జడ్పీ సభ్యుడు ధవలేశ్వర నాయుడు తదితరులు పాల్గొన్నారు. నూతన బస్టాండులో ప్రయాణికుల విశ్రాంతి గదులు, ఎల్ఈడీ టీవీలు, మరుగుదొడ్లు, తాగేందుకు పరిశుభ్రమైన నీరు, మొబైల్ చార్జింగ్ పాయింట్లు వంటి అనేక సౌకర్యాలతో పాటు వికలాంగులకు ప్రత్యేక సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

ఒడిశా

కొత్తపేటలో వాలీబాల్ పోటీలు



వాలీబాల్ పోటీలు ప్రారంభిస్తున్న కొండబాబు

రాయగడ: కొత్తపేట యువజన సంఘం ఆధ్వర్యంలో అంతరాష్ట్ర వాలీబాల్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను బిజూ జనతాదళ్ సీనియర్ నేత వై.వెంకటేశ్వరరావు(కొండబాబు) ముఖ్యఅతిథిగా పాల్గొని, ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులంతా గెలుపోటములను లెక్కచేయక స్నేహపూరితంగా ఆడాలన్నారు. అలాగే క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు కోరుకుంటున్నానని తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన మొత్తం 18 జట్లు పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది బిరజ పాత్ర, కె.శ్రీనివాస్, కేసీ పట్నాయక్ మాధవరావు, సంజీవ్‌కుమార్ పాల్గొన్నారు.

కనుల పండువగా సీతారామ కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

రాయగడ: స్థానిక రామనగర్ రామలింగేశ్వర ఆలయంలో శుక్రవారం రాత్రి రథసప్తమి పర్వదినం సందర్భంగా ఆలయ ట్రస్టు సీతారామ కల్యాణం నిర్వహించారు. ఆలయ ట్రస్టీ గుడ్ల గౌరీప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ వేదపండితుడు భాస్కారాచార్యులు విప్ర బృందం సీతారాముల కల్యాణ జరిపించారు. కార్యక్రమలో అధిక సంఖ్యలో భక్తుల పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి యువకుడి మృతి


వెంకట రమణ (ఫైల్)

గజపతినగరం: కొనిస గ్రామం వద్ద బైకుతో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి యువకుడు మృతిచెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. పురిటిపెంట గ్రామానికి చెందిన శనపతి వెంకటరమణ(20) కొనిస గ్రామానికి వెళ్లి టిఫిన్ తీసుకు రావడానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా వాహనం అదుపు తప్పడంతో ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టాడు. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి అప్పలనాయుడు, తల్లి అప్పలరాములు వ్యవసాయ కూలీలు. వీరికి ఇద్దరు కుమారులు కాగా, చేతికి అందొచ్చిన పెద్ద కుమారుడు మృతి చెందడంతో కుటుంబంలో విషాద ఛాయలు అలముకున్నాయి. తండ్రి అప్పలనాయుడు చేసిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ మహేష్ కేసునమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఆశ్రమ పాఠశాల విద్యార్థి..

మక్కువ: మండలంలోని ఎర్రసామంతవలస గిరిజనసంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న సాలూరు మండలం కారాడవలసకు చెందిన అశోక్(15) అనారోగ్యంతో శనివారం ఉదయం మృతిచెందాడు. వివరాల మేరకు.. రక్తహీనతతో బాధపడుతున్న అశోక్‌ను ఆశ్రమ పాఠశాల సిబ్బంది శుక్రవారం శంబర పీహెచ్‌సీకి తీసుకువెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షలు చేయించి మందులు ఇచ్చి పంపారు. శుక్రవారం రాత్రి తీవ్ర అస్వస్థతకు గురయిన అశోక్‌ను పాఠశాల సిబ్బంది పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతిచెందాడు. ఇదిలా ఉండగా ప్రిన్సిపాల్, వార్డెన్ల నిర్లక్ష్యంతో విద్యార్థి అశోక్ మృతిచెందాడని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.రవికుమార్, నాయకులు హరికృష్ణ ఆరోపించారు. విద్యార్థి హార్ట్ ఎటాక్‌తో చనిపోయినట్లు ప్రిన్సిపాల్ చెప్పగా, నిన్న రాత్రివరకు చక్కగా చదువుకున్న విద్యార్థి ఉదయం మరణించడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

శృంగవరపుకోట రూరల్: స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు చొరబడి వివిధ వస్తువులను అపహరించారు. ఈ విషయంపై శనివారం ఉదయం స్థానికులు మాట్లాడుతూ బీఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగి రేపాక సన్యాసిశెట్టి శుక్రవారంసాయంత్రం చెన్నైలో ఉన్న తన కుమారుడి వద్దకు వెళ్లాడు. అదే రోజు రాత్రి ఆయన ఇంట్లో చోరీ జరిగింది. సంఘటన స్థలాన్ని సీఐ మురళి సందర్శించారు. ఇంట్లో బంగారం, పది కేజీల వెండితో పాటు నగదు పోయిందని పేర్కొన్నాడు. పూర్తి వివరాలు తాను ఇంటికి చేరుకొని చెబుతామని పోలీసులకు తెలిపాడు. చోరీ అయినట్లు చెబుతున్న వెండి వస్తువులు యథాతథంగా ఉన్నట్లు తెలిసింది. దీనిపై సీఐ మురళి మాట్లాడుతూ దొంగతనంలో ఏమేమి పోయాయో బాధితుడు వచ్చి ఫిర్యాదు చేస్తానని చెప్పారన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

శృంగవరపుకోట రూరల్: సీతారాంపురంవద్ద బైక్ అదుపుతప్పి ఎస్.కోటకు చెందిన రాంబాబు తీవ్రంగా గాయపడ్డాడు. శనివారం విజయనగరం నుంచి ఎస్.కోట వస్తుండగా గ్రామసమీపంలోని మలుపు వద్ద ఆయన ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం అదుపు తప్పింది. దీంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108లో ఎస్.కోట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అందజేత

విజయనగరం క్రైం: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పోగొట్టుకున్న 30 మొబైల్స్‌ను శనివారం సైబర్ పోలీసు స్టేషన్‌లో సోషల్ మీడియా సైబర్ సెల్ సీఐ టి .విజయ్‌కుమార్ బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న బాధితులు ఆన్‌లైన్ ద్వారా, లేదా నేరుగా సైబర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు ప్రశాంత్‌కుమార్, నసీమా బేగం, కానిస్టేబుల్స్ వాసుదేవ్, శ్రీనివాసరావు, రాజేష్, నాగమణి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్‌పేట వద్ద చెరకు లారీ బోల్తా


రోడ్డుపై చెల్లాచెదురుగా పడి ఉన్న చెరకు లోడు

రేగిడి: రేగిడి: పాలకొండ- రాజాం రోడ్డు మజ్జిరామునిపేట వద్ద ఓ చెరకు లారీ శనివారం మధ్యాహ్నం బోల్తా పడింది. ఈ ఘటనలో ఎవరికీ ప్రాణాపాయం లేకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. కొద్దిసేపు పాలకొండ- రాజాం రహదారి మార్గంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. రోడ్డుకు అడ్డంగా పడిన చెరకు తీసేవరకు వాహనాలు వెళ్లలేకపోయాయి. చెరకు పరిశ్రమకు సరుకు తరలిస్తున్న వాహనాలు తరచూ తిరగబడుతున్నాయి. శనివారం ఓవర్‌లోడ్ కారణంగా వాహనం తిరగబడిందని.. డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని ఎస్ఐ శ్రీనివాస్ వెల్లడించారు.

తహసీల్దార్ బంధువు రాజేంద్ర మృతి

● గుండెపోటు వల్లే మృతిచెందారని కుటుంబ సభ్యుల వెల్లడి

విశాఖపట్నం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): విశాఖలో ఈనెల రెండో తేదీన హత్యకు గురైన తహసీల్దార్ సనపల రమణయ్యకు బంధువుగా చెప్పుకున్న ప్రధాన రాజేంద్ర (47) శుక్రవారం రాత్రి మృతిచెందారు. ప్రసాద్ అనే వ్యక్తి తనకు ఫోన్‌చేసి చీపురుపల్లిలోని తమ భూమిలో అడుగుపెట్టొద్దని, అడుగు పెట్టినట్టయితే చంపేస్తానని బెదిరించారంటూ తహసీల్దార్ హత్య జరిగిన మరుసటిరోజు రాజేంద్ర మీడియాకు వెల్లడించిన విషయం తెలిసిందే. తనను బెదిరించిన ప్రసాదే తనకు వరుసకు సోదరుడయ్యే తహసీల్దార్ రమణయ్యను హత్యచేసి ఉంటాడని రాజేంద్ర అనుమానం వ్యక్తంచేశారు. అయితే రమణయ్యను హత్యచేసింది మురారి సుబ్రహ్మణ్యం గంగారావు అని పోలీసుల దర్యాప్తులో తేలింది. అతడిని అరెస్టుచేసి జైలుకు తరలించారు. ఇదిలా వుండగా తహసీల్దార్ బంధువుగా చెప్పుకుంటున్న ప్రధాన రాజేంద్ర శుక్రవారం మృతిచెందడం చర్చనీయాంశంగా మారింది. పోలీసులు, ప్రసాద్, తదితరుల ఒత్తిళ్లను తట్టుకోలేకే రాజేంద్ర మృతిచెందాడంటూ ప్రచారం జరిగింది. అయితే రాజేంద్ర భార్య త్రివేణి మాత్రం తన భర్తకు గుండెపోటు రావడం వల్లే మృతిచెందారని, ఇందులో ఎలాంటి అనుమానాలకు తావులేదని స్పష్టం చేశారు. శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం కోటపాటు కొత్తూరుకు చెందిన ప్రధానరాజేంద్ర పదేళ్ల కిందట విశాఖ వచ్చి ఎంవీపీకాలనీలోని గాది రాజు ఎంపైర్స్‌లో కుటుంబంతో నివాసం ఉంటున్నారు. భార్య త్రివేణితోపాటు ఏడేళ్ల కుమార్తె ఉంది. రాజేంద్ర కొంతకాలం కిందటి వరకూ అనకాపల్లిలో మహీంద్ర ట్రాక్టర్ల షోరూమ్ నిర్వహించేవారు. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ వ్యాపారంలో కొనసాగుతున్నారు. కాగా త్రివేణి కథనం ప్రకారం...మధుమేహం కలిగి ఉన్న రాజేంద్ర శుక్రవారంరాత్రి భోజనం చేసిన తర్వాత ఒక్కసారిగా షుగర్ లెవెల్స్ పెరిగిపోవడంతో కుప్పకూలిపోయారు. వెంటనే షీలానగర్‌లోని కిమ్స్ ఆస్పత్రికి తరలించామని, అక్కడ చికిత్స పొందుతూ రాత్రి పది గంటల సమయంలో మృతిచెందారు. కార్డియాక్ అరెస్టు వల్లే రాజేంద్ర మృతిచెందినట్టు వైద్యులు కూడా నిర్ధారించారన్నారు. తన భర్త అంత్యక్రియలు కూడా పూర్తయినందున ఆ విషయాన్ని అక్కడితో వదిలేయాలని ఆమె కోరారు. తన భర్త మృతి చెందడంతో ఏడేళ్ల కుమార్తెతో ఎలా బతకాలో తెలియని స్థితిలో ఉన్న తమను కొన్ని టీవీఛానల్స్ తప్పుడు వార్తలు ప్రసారంచేసి మనోవేదనకు గురిచేస్తున్నారని వాపోయారు.ఏదైనా లేనిపోని అనుమానాలతో కథనాలు ప్రసారంచేస్తే ఆయా మీడియాసంస్థల పేరు చెప్పి తనకుమార్తెతో కలిసి ఆత్మహత్య చేసుకోవడం ఒక్కటే తనకు మార్గమని త్రివేణి ఆవేదన వెళ్లగక్కారు.

రహదారి భద్రతపై అవగాహన అవసరం

విజయనగరం క్రైం: విద్యార్థి దశ నుంచే రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి.శ్రావ్య అన్నారు. రింగురోడ్డు సమీపంలోని భాష్యం స్కూల్‌లో శనివారం రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. జెడ్పీ ఉన్నత పాఠశాల (దాసన్నపేట)లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రాము నాయుడు, పి.రమణమ్మ పాల్గొన్నారు.

'రాజధాని ఫైల్స్'తో వైసీపీ వెన్నులో వణుకు

● రాజాం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోండ్రు


మాట్లాడుతున్న కోండ్రు మురళీమోహన్

రాజాం: రాజధాని ఫైల్స్ సినిమాతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వెన్నులో వణుకు పుడుతోందని రాజాం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్ తెలిపారు. శనివారం రాజాంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతుల త్యాగాలకు వాస్తవ రూపంగా రాజధాని ఫైల్స్ సినిమా అని తెలిపారు. వేలమంది రైతుల త్యాగాలను సైకో సీఎం జగన్ బూడిదలో పోసిన పన్నీరుచేశాడన్నారు. అమరావతి రైతుల ఉసురుపోసుకున్నారన్నారు. రైతుల బతుకు చిత్రంపై తీసిన సినిమాను అడ్డుకునే నీచస్థితికి జగన్ ప్రభుత్వం దిగజారిందన్నారు. సామాజిక బాధ్యతతో సినిమా తీస్తే జగన్‌రెడ్డికి వచ్చిన నష్టం ఏమిటని కోండ్రు ప్రశ్నించారు. ఒక సినిమాను చూసి ముఖ్యమంత్రి భయపడడం దేశచరిత్రలో ఇదే తొలిసారి అన్నారు. ఈ సినిమా ద్వారా ప్రజల్లో మరింత వ్యతిరేకత వస్తుందన్న భయంతో వైసీపీ కోర్టుకు వెళ్లినా, ఆపలేకపోయిందని తెలిపారు. ఐదు కోట్లు ఆంధ్రుల కలల రాజధానిని చిత్రం చేసిన తుగ్లక్ సీఎం జగన్ అన్నారు. మూడు రాజధానుల పేరుతో ఆంధ్రులను మోసంచేసిన మూర్ఖుడని, జగన్ ప్రాంతాల పేరుతో ప్రజలను విడగొట్టి రాజకీయ లబ్ధిపొందాలని చూశాడన్నారు.అసెంబ్లీ సాక్షిగా అమరావతికి మద్దతు తెలిపిన జగన్ అధికారంలోకి వచ్చేక మూడు రాజధానులు పేరుతో మాటమార్చారని మండిపడ్డారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు నంది సూర్యప్రకాష్‌రావు, బనిశెట్టి వెంకటరావు, ఉరిటి సురేంద్ర, బోనేల నారాయణరావు, బెజ్జిపురపు రవి, హోంజరాం రాము పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే అభివృద్ధి: మీసాల గీత

● లోకేశ్‌పై వ్యాఖ్యలు తగవు


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గీత

విజయనగరం రూరల్: విజయనగరంలో ప్రధాన కూడళ్ల అభివృద్ధి టీడీపీ హయాంలో జరిగాయని మాజీ ఎమ్మెల్యే మీసాల గీత తెలిపారు. పార్టీని కాకుండా, తనను చూసి ఓటేయాలని ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి ప్రజలనుఅడగడం విడ్డూరంగా ఉందన్నారు. శంఖారావంలో భాగంగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎమ్మెల్యే కోలగట్లను ఉద్దేశించి వాస్తవాలే మాట్లాడారన్నారు. వీరభద్రస్వామి లోకేశ్, టీడీపీని ఉద్దేశించిన చేసిన వ్యాఖ్యలనుఖండించారు. శనివారం విజయనగరంలో ఏఎంసీ మాజీ చైర్మన్ సైలాడ త్రినాథ్, టీడీపీ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎస్ఎన్ఎం రాజుతో కలిసి గీత విలేకరులతో మాట్లాడారు. గెలిపించిన పార్టీని కాదని, నన్ను చూసి ఓటేయాలనడంలో అంతరార్థం ఏమిటని ప్రశ్నించారు. రాజకీయాల్లో ఉన్నప్పుడు సద్విమర్శలు స్వీకరించాలి తప్ప, విమర్శలకు ప్రతి విమర్శలు చేయడం ఎంత వరకూ సబబని ప్రశ్నించారు. గంజాయి విషయంలో ఎమ్మెల్యే వీరభద్రస్వామి, టీడీపీ ఎమ్మెల్యేలకు కూడా ఇందులో సంబంధం ఉందని చెబుతున్నారన్నారు. అలాగైతే, నాలుగేళ్ల పదినెలల్లో టీడీపీ ఎమ్మెల్యేలపై ఎందుకుచర్యలు చేపట్టలేదో కోలగట్ల స్పష్టం చేయాలని డిమాండ్‌చేశారు. సమావేశంలో టీడీపీ నాయకులు త్రినాథ్, ఎస్ఎన్ఎం రాజు, తుంపిల్లి రమణ, కెల్ల సూరిబాబు, చిప్పాడ స్వామి, సుంకరబోతు బంగార్రాజు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

● ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘ నాయకులు నిరసన




కొత్తవలస, బొబ్బిలిలో నిరసన తెలుపుతున్న జేఏసీ ప్రతినిధులు

ఉద్యోగులు సమస్యల పరిష్కారానికి రాష్ట్ర జేఏసీ నాయకులు ఇచ్చిన పిలుపు మేరకు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘ నాయకులు శనివారం జిల్లా వ్యాప్తంగా నిరసన తెలిపారు.

● **కొత్తవలస:** ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కొత్తవలస తాలూకా యూనిట్ ఎన్జీఓస్ సంఘ అధ్యక్షుడు సీహెచ్ ఈశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం కొత్తవలస, లక్కవరపుకోట మండలాలకు చెందిన వైద్యశాఖ, ఐసీడీఎస్ ఉద్యోగుల ఆధ్వర్యంలో పీహెచ్‌సీ ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. 30శాతం ఐఆర్ మంజూరు చేయాలని, పెండింగ్‌లో ఉన్నడీఏలను విడుదలచేయాలని కోరారు. ●**బొబ్బిలి** :పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్, కార్మిక సంఘం జేఏసీ నాయకులు డిమాండ్‌చేశారు. బొబ్బిలి ఎన్జీవో హోమ్ నుంచి ఎస్‌బీఐ సెంటర్, తాండ్రపాపారాయ జంక్షన్, రెండు కోటల జంక్షన్ మీదుగా తహసీల్దార్ కార్యాలయంవరకూ ర్యాలీచేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిప త్రంఅందజేశారు.కార్యక్రమంలో జేఏసీ బొబ్బిలి తాలూకా యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు జి.సూర్యనారాయణ, బి.రామారావు, నాయకులు రౌతు రామ్మూర్తి, కర్రి సత్యనారాయణ, కె.విజయగౌరి, జేసీ రాజు, ధనుంజయరావు, దాసరి వెంకటనాయుడు, రామారావు, కర్ణ జోగారావు పాల్గొన్నారు.

వైసీపీ నాయకులు అభివృద్ధి నిరోధకులు

● కొట్టక్కిలో బస్సుషెల్టర్ నిర్మాణం అడ్డుకోవడం తగదు

● తెలుగుదేశం పార్టీ నాయకుల ధ్వజం


ఎస్ఐ జ్ఞానప్రసాద్‌తో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

రామభద్రపురం: మండలంలోని కొట్టక్కిలో వైసీపీ నాయకులు అభివృద్ధి నిరోధకులుగా మారుతున్నారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి చింతల రామకృష్ణ, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మడక తిరుపతినాయుడు ఆరోపించారు. కొట్టక్కిలో బస్సుషెల్టర్ నిర్మాణాన్ని వైసీపీ నాయకులు అడ్డుకోవడంతో ఎస్ఐ జ్ఞానప్రసాద్‌తో శనివారం టీడీపీ నాయకులు మాట్లాడారు. ఇక్కడ టీడీపీ మండల యువత అధ్యక్షుడు ముల్లు రాంబాబు ఆధ్వర్యంలో బస్సు షెల్టర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈమేరకు పునాదులు తవ్వడంతోపాటు మెటీరియల్ కూడా వేశారు. అయితే కొట్టక్కి గ్రామానికి చెందిన కొంతమంది వైసీపీ నాయకులు అనుమతిలేకుండా బస్సుషెల్టర్ నిర్మాణం చేపడుతున్నారని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. దీంతో కొట్టక్కికి చెందిన టీడీపీ నాయకులతోపాటు మరికొంతమంది ప్రతిపక్షనాయకులు స్టేషన్‌కు చేరుకుని అక్కడి పరిస్థితులను ఎస్ఐకు వివరించారు. గ్రామంలో తాము సొంత నిధులతో అభివృద్ధి పనులు చేస్తున్నా అధికారపార్టీ నాయకులు అడ్డుతగలడం సమంజసంకాదని హితవుపలికారు.ఇప్పటికే టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బేబీనాయన సుమారు రూ.10 లక్షలతో ఐదు రోడ్లునిర్మించారని తెలిపారు. బస్సుషెల్టర్ కూడా ప్రభుత్వానికి సంబంధం లేకుండా సొంతనిధులతో నిర్మిస్తున్నామని, తమకు మైలేజ్ వస్తుందన్న షాకుతో అడ్డుతగలడం అధికార పార్టీ నాయకులకు తగదన్నారు.ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా బస్సుషెల్టర్ నిర్మాణాన్ని చేపడతామని పోలీసులకు తెలిపారు.అధికార పార్టీ నాయకులకు నచ్చజెప్పి నిర్మాణానికి సహకరించాలని ఎస్ఐ జ్ఞానప్రసాద్‌కు టీడీపీ నాయకులు కోరారు. ఇటీవలఅధికారబలంతో కొట్టక్కికి చెందిన నాయకులు తమపై తప్పుడు ఫిర్యాదులు చేయడం భావ్యంకాదని ముల్లు రాంబాబు తెలిపారు. ప్రజల్లో విశ్వాసం కోల్పోయిన వైసీపీ నాయకులు ఇటువంటి కుట్రలు, కుతంత్రాలు పన్నడం మానుకోవాలని సూచించారు. ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న వీరికి రానున్న ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెబుతారని టీడీపీమండలాధ్యక్షుడు కరణం విజయభాస్కర్ తెలిపారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులు వంగపండు అప్పలనాయుడు, భీమునాయుడు, గంట సాయికుమార్, కొట్టక్కి టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో టీడీపీకి మద్దతివ్వాలి

● విజయనగరం నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు


విజయనగరంలో బాబుష్యూరిటీ కార్యక్రమం నిర్వహిస్తున్న అదితి

విజయనగరం రూరల్: రానున్న ఎన్నికల్లో టీడీపీకి మద్దతు ఇవ్వాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు కోరారు. విజయనగరంలోని పదో డివిజన్‌లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా అదితి గజపతిరాజు డివిజన్ పరిధిలోని బొందిల గూడెం, అశోక్‌నగర్, కాటవీధి, సుంకరవీధి తదితర ప్రాంతాల్లో పర్యటించారు.ఈ సం దర్భంగా ఆమె ఇంటింటికి వెళ్లి చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను ప్రజలకు వివరించారు.చిరువ్యాపారులను కలిసి వారు పడుతున్న ఇబ్బందులును తెలుసుకున్నారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు ఆడపా నారాయణరావు, షేక్ జానీ, చిప్పాడ అన్నపూర్ణ, చిప్పాడ స్వామి పాల్గొన్నారు.

లోకేశ్‌ను కలిసిన నాయకులు

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు ఆధ్వర్యంలో పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేశ్‌ను మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ ప్రసాదుల కనకమహాలక్ష్మి, నగర టీడీపీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రసాదుల లక్ష్మీవరప్రసాద్, ఆల్తి బంగారుబాబు, టీడీపీ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి అనురాధ బేగం తదితరులు కలిశారు. ఈ సందర్భంగా పార్టీ పరిస్థితిని చర్చించారు.

సీపీఎస్ ఉద్యోగుల ముందస్తు అరెస్ట్

రాజాం: సీపీఎస్ రద్దుచేసి పాతపింఛన్ విధానాన్ని అమలు చేయా లని చలోవిజయవాడకు హాజరుకాకుండా సీపీఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి మొయ్యి శ్రీరాములు, రాజాం సమితి నాయకులు కుమరాపు చంద్రి నాయుడు, శ్రీకరు, కుప్పిలి రమేష్, డోల వాసు తదితరులను పోలీసులు ముందస్తుగా శనివారం అరెస్ట్ చేశారు. చలోవిజయవాడకు హాజరైతే ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారని యూనియన్ నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమం ముగిసే వరకూ ప్రతిరోజూ స్టేషన్‌కు వచ్చి సంతకాలు చేయాలని సూచించారని చెప్పారు. సీపీఎస్ నాయకులంతా స్టేషన్‌కు వచ్చి సంతకాలు చేయకపోతే కేసు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారని తెలిపారు.

పోలిపల్లి అమ్మవారి జాతరకు ముహూర్తపు రాట


ముహూర్తపు రాట వేస్తున్న అర్చకులు

రాజాం: రాజాంలో వచ్చేనెలలో పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతర పురస్కరించుకుని శనివారం ధర్మకర్తవాకచర్ల దుర్గాప్రసాద్, ఈవో బీవీ మాధవరావు ఆధ్వర్యంలో అర్చకులు వేమకోటి సూర్యనారాయణ శర్మ వేదమంత్రోశ్చరణ మధ్య ముహూర్తపు రాట వేశారు. అనంతరం యాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సాలాది తులసీ దాస్, సలాది మహేష్, లంకటపల్లి సత్యనారాయణ, వాకచర్ల రాజా, వాకచర్ల పైడిరాజు, వెంపట లక్ష్మణరావు, పెంకి చైతన్యకుమార్ పాల్గొన్నారు.

కెన్యాకు సబల సంస్థ కార్యదర్శి సరస్వతి

కొత్తవలస: కెన్యాలో ఈ నెల 18 నుంచి 24 వరకు జరగనున్న అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌కు కొత్తవలసకు చెందిన సబల సంస్థ కార్యదర్శి కొమ్మోజుల సరస్వతి ఎంపికయ్యారు. ప్రకృతి వ్యవసాయం, సుస్థిర అభివృద్ధి, చిరుధాన్యాలతో కూడిన జీవ వైవిధ్య వ్యవసాయంతో చేసిన సేవలకుగాను గుర్తింపుగా ఈ ఆహ్వానం అందింది. భారతదేశం నుంచి ఎంపిక చేసిన ఏడుగురిలో సరస్వతి ఒకరు. సరస్వతిని జిల్లా వ్యవసాయ పరిశోధనకేంద్ర డైరెక్టర్ టీఎస్ఎస్‌కే పాత్రో, సబల వైస్‌ప్రెసిడెంట్ కె.జోగినాయుడు తదితరులు అభినందించారు.

జాతీయ పుస్తక నిధి నుంచి బహుమానం

రాజాం: సంతకవిటి మండలంలోని బొద్దూరు జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు అదపాక దామోదరరావుకు జాతీయ పుస్తక నిధి నుంచి రూ.13,500 విలువచేసే పుస్తకాలు బహుమానం కింద లభించాయి. ఈ మేరకు ఇందులో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ రాసిన పరీక్షలు యోధులు, భారత దేశంలో మాతృస్వామ్యవ్యవస్థ మూలాలు తెలిపే ఇందులేఖ, వివిధ బోధనోపకరణాలకు సంబంధించినవి, స్వాతంత్రపోరాటానికి సంబంధించిన ఆంగ్ల, తెలుగు పుస్తకాలు ఉన్నాయి. వీటి సారాంశాన్ని విద్యార్థులకు తెలియ పరిచి చక్కగా ఉపయోగించాలని ఎంఈవో భాస్కరరావు, ప్రధానోపాధ్యాయులు మల్లేశ్వరరావు సూచించారు. ఈ మేరకు ఆ పుస్తకాలను ఎంఈవో ఆవిష్కరించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసాద్, సత్యనారాయణ, పొట్నూరు కృష్ణ, పురుషోత్తం, పెంకి చైతన్యకుమార్ పాల్గొన్నారు.

రేపటి నుంచి కొత్త భవనంలో రిజిస్ట్రేషన్లు

కొత్తవలస : స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సోమవారం నుంచి యధావిధిగా రిజిస్ట్రేషన్లు జరుగుతాయని కొత్తవలస సబ్ రిజిస్ట్రార్ టి.తారకేష్ తెలిపారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని స్థానిక జడ్పీహైస్కూల్ గ్రౌండ్‌కు ఎదురుగానున్న నూతన భవనంలోకి మార్పు చేస్తున్నామని తెలిపారు. శుక్ర, శనివారాలలో పనులు చేయడం వల్ల రిజిస్ట్రేషన్లు నిలిపివేశామన్నారు. కొత్త కార్యాలయానికి ఇంటర్నెట్ సౌకర్యంతో పాటు ఐజీ కార్యాలయం నుంచి అనుమతి లభించడంతో సోమవారం నుంచి యధావిధిగా రిజిస్ట్రేషన్లు చేస్తామని చెప్పారు.

తెలగలను బీసీల్లో చేర్చే వరకూ పోరాటం


మోకాళ్లతో నిరసన తెలియజేస్తున్న చనుమల్లు ప్రసాదరావు

విజయనగరం దాసన్నపేట: తెలగ కులస్థులను బీసీల్లో చేర్చేంత వరకూ పోరాటాన్ని ఉధృతం చేస్తామని ఉత్తరాంధ్ర తెలగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చనుమల్లు ప్రసాదరావు హెచ్చరించారు. శనివారం కలెక్టరేట్ వద్ద మోకాళ్లతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ నెల 23న ఉత్తరాంధ్రలోని అన్ని మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమం చేపడతామన్నారు.కార్యక్రమంలో సంఘ ప్రతినిధులుసత్యనారాయణ, నానాజీ, అప్పారావు దొర, లక్ష్మిపాల్గొన్నారు. ●**రాజాం:** తెలగలను బీసీఏలో చేర్చాలని ఉత్తరాంధ్ర తెలగ సంక్షేమ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నంది సూర్యప్రకాశ్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు మారినా తమ విషయంలో పట్టించుకోవడం లేదని తెలిపారు.

కొలతలు సరిగా లేకపోతే గిట్టుబాటు కాదు

రేగిడి: ఉపాధి వేతనదారులు కొలతల ప్రకారం పని చేయకపోతే వేతనం రూ.272 గిట్టుబాటు కాదని.. అందుకే రెండు పూటలా పని చేయాలని ఉపాధి ఏపీఓ హరనాథ్ సూచించారు. అంబాడ గ్రామంలోని లెంకవాని చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను శనివారం ఆయన తనిఖీ చేశారు. హాజరును పరిశీలించారు. మస్తర్ల నమోదులో తేడాలు ఉండకూడదని చెప్పారు. ఆయన వెంట ఈసీ రామినాయుడు, టీఏ పార్థసారథి, ఎఫ్ఏ చంద్రమౌళి పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తిచేయాలి: కమిషనర్

రాజాం: అర్బన్ హెల్త్ సెంటర్‌లో పెండింగ్ పనులు పూర్తిచేయాలని మునిసిపల్ కమిషనర్ ఎన్.అప్పలనాయుడు కాంట్రాక్టర్లను ఆదేశించారు. శనివారం రాజాం అర్బన్ హెల్త్ సెంటర్‌లో పెండింగ్ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈలు భాగ్యలక్ష్మి వెంకటయ్య, శానటరీఇన్‌స్పెక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

రోడ్లపై మురుగు..కాలువల్లో వ్యర్థాలు


బొబ్బిలి పూల్‌బాగ్‌రోడ్డులో రోడ్డుపైకి చేరుతున్న మురుగు నీరు

బొబ్బిలి: బొబ్బిలిలో మురుగు నీటి కాలువల నిర్వహణ గాడితప్పింది. ప్రధానంగా దశాబ్దాల కిందట నిర్మించిన కాలువలు కావడంతో శిథిలావస్థకు చేరాయి. దీంతో పలు చోట్ల రోడ్లపైకి మురుగుచేరుతోంది. కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోవడంతో ప్రజలకు అవస్థలు తప్పడంలేదు. మురుగుకాలువలు అధ్వానంగా ఉన్నా మునిసిపల్ అధికారులు మరమ్మతులకు చర్యలు తీసుకోవడంలేదు. ప్రధానంగా నిత్యం రద్దీగా ఉండే పూల్‌బాగ్ రోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి తదితర ప్రాంతాల్లో డ్రైనేజీలో మురుగు పేరుకుపోవడంతో దుర్గంధం వెదజల్లుతుండడంతో పాదచారులు, వాహనచోదకులు,వ్యాపారులు అవస్థలకు గురవు తున్నారు.

రేపు రాజాంలో జాబ్‌మేళా

రాజాం: రాజాం వెలుగుకార్యాలయంలో సోమవారం ఉదయం పది గంటలకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు వెలుగు ఏపీఎం ఎన్.అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారికి ప్రొడక్షన్ కెమిస్ట్ సెల్స్ సూపరువైజర్లు, విశ్వ సముద్ర, విజయనగరం సెంచూరియాన్ యూనివర్శిటీ విజయ నగరంలో శిక్షణ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. బీఎస్సీ కెమిస్ట్రీ, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ చదివిన వారు మాత్రమే అర్హులని ఆయన తెలిపారు.

3 నుంచి బాలల సినీ ఉత్సవం

విజయనగరం రింగురోడ్డు: విజయనగరంలో మార్చి మూడోతేదీ నుంచి బాలల సినీఉత్సవాన్ని నిర్వహిం చనున్నట్లు ఎన్‌సీఎస్ చారిటబుల్ ట్రస్టు సభ్యుడు నారాయణం శ్రీనివాస్ తెలిపారు. శనివారం విజయనగరంలో ఉత్సవ ఆహ్వానపత్రులను ఆవి ష్కరించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిల్డ్రన్ ఫిలిం ఫెస్టివల్ కమిటీకి తాను చైర్మన్‌గా,ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా మండా రవి, కోచైర్మన్‌గా నారాయణం నిత్యా దవళ వెంకటరావు వ్యవహరిస్తారని తెలిపారు. 3 నుంచి 15 వరకు కామెడీస్ ఆఫ్ చార్లీ ఛాంప్లిన్ పేరుతో ఈ ఉత్సవం రోటరీ క్లబ్ పోర్టు, విజయనగరం ఫిలిం సొసైటీ, ఎన్‌సీఎస్ చారిటబుల్ ట్రస్టు సంయుక్తంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశంలో డాక్టరు సంతోష్, అభిషేక్ రిక్కీ, సంధ్య పాల్గొన్నారు.

రేపు ఆశీలు వసూలుకు వేలం

రాజాం: పురపాలక సంఘం పరిధిలో రోజు వారీ ఆశీలు వసూలు చేయడానికి సోమవారం బహిరంగ వేలం వేయనున్నట్లు కమిషనర్ ఎన్.అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు ఆశీలు వసూలుకు బహిరంగ వేలంపాట ఈనెల 15న నిర్వహించినా పాటదారులు ఎక్కువగా పాల్గొనక పోవడంతో వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో రెండోసారి ఈనెల 19వతేదీ ఉదయం 11 గంటలకు పాటపడుతున్నారు. ఈమేరకు సాల్వెన్సీ ధ్రువపత్రం తీసుకుని రోజు వారీ మార్కెట్‌కు రూ. 50 వేలు, కబేళాలకు రూ.మూడువేలు ధరావత్తు చెల్లించాలని సూచించారు.

బాల్యవివాహాలపై అవగాహన

బొబ్బిలి: పట్టణంలోని పాతబొబ్బిలిలో బాల్యవివాహాలపై బుర్రకథప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ పీవో జె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో కళాకారులు బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఆడపిల్లలపై ర్యాగింగ్, మహిళల భద్రత చట్టాలపై కూడా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు చోడిగంజి రమేష్‌నాయుడు, కోట పెదరాములు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అరుణ, బాలామణి పాల్గొన్నారు.

'మీ వెంటే ఉంటాం'

శృంగవరపుకోట రూరల్: 'మాకు ఐవీఎస్‌రాజు కాలం నుంచి మీ కుటుంబంతో ఎంతో సాన్నిహిత్యం ఉంది. మీరు ఏ పార్టీలో ఉంటే... మేం ఆ పార్టీలో ఉంటామ'ని... మండలంలోని కృష్ణాపురం గ్రామస్థులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుతో తెలిపారు.ఎమ్మెల్యే కడుబండి వల్ల రెండున్నరేళ్లగా పడుతున్న ఇబ్బందులు.. ఆయనకు టిక్కెట్ ఇస్తేవచ్చే పరిణామాలు,కార్యకర్తల మనోభావాలు దెబ్బతినకుండా ఎలా ముందుకు వెళ్లాలనే అంశంపై చర్చించారు. స్థానిక ఎమ్మెల్యే పెట్టిన ఇబ్బందుల గురించి మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు కార్యకర్తలు, నాయకులు మాట్లాడుతూ 'మాకు పార్టీలతో సంబంధం లేదు. మీరు ఎక్కడ ఉంటే.. అక్కడ ఉంటామ'ని తేల్చిచెప్పారు.

ఉపాధి పనులపై చర్చ

శృంగవరపుకోట రూరల్: మండలంలోని పల్లపు దుంగాడలో గిరిజనులతో ఉపాధిహామీ ద్వారా చేపట్టాల్సిన పనులపై ఏపీడీ శారదాదేవి శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇక్కడ చేయాల్సిన పనులు, ఇతర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఏపీవోలు తిరుపతి, రమ్య పాల్గొన్నారు.

ముగిసిన స్టెప్‌కాన్ సదస్సు

రాజాం రూరల్: సివిల్, మెకానికల్, కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, కంప్యూటర్‌సైన్స్‌లో సాంకేతికత పురోగమిస్తోందని నేషనల్ టెక్నాలజికల్ లేబరేటరీ (ఎన్ఎస్‌టీఎల్) డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ స్పష్టం చేశారు. రాజాంలోని జీఎంఆర్ఐటీలో రెండురోజులుగా నిర్వహిస్తున్న స్టెప్‌కాన్ సదస్సు శనివారం ముగిసింది. ఈ సందర్భంగా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి హాజరైన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. 281 మంది విద్యార్థులు వివిధ విభాగాలలో సాంకేతిక పత్రాలను సమర్పించారు. 652 మంది విద్యార్థులు అధునాతన సాంకేతిక వర్క్‌షాప్‌లో, 91 మంది విద్యార్థులు ప్రాజెక్ట్ ఎగ్జిబిషన్‌లో 81 మంది విద్యార్థులు స్టార్టప్ ఐడియాస్ పోటీలలో పాల్గొన్నారు. విజేతలకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. కార్య క్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్, అసోసియేట్ ప్రొఫెసర్ రోషన్ శ్రీవాస్తవ్, ఎల్ఎం లక్ష్మణమూర్తి, గిరీష్ తదితరులు పాల్గొన్నారు.